క్లుప్తంగా

గవర్ల అనకాపల్లిలో సమస్యలు పరిష్కరించాలని వినతి



గవర్ల అనకాపల్లిలో సమస్యలపై వినతి అందజేస్తున్న దృశ్యం

మునగపాక : తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సచివాలయ ఉద్యోగులకు వినతి అందజేశారు. గ్రామంలో పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ వినతి అందజేశారు. సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని పలువురు కోరారు. వినతి అందజేసిన వారిలో ఆళ్ల వెంకటేశ్వర్లు, పి.బాల, పి.రామ సురేష్, నూకరాజు, విశ్వ, దాడి గణేష్ తదితరులున్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలి



మూలపేటలో విద్యా కిట్లను అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మండలంలోని మూలపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన గురువారం విద్యార్థి కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు పని చేస్తుంటారన్నారు. వారి సేవలను వినియోగించుకోవాలన్నారు.

రామన్నపాలెంలో డ్రైనేజీ పనులు ప్రారంభం



రామన్నపాలెంలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని రామన్నపాలెంలో గురువారం డ్రైనేజీ పనులను సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు ప్రారంభించారు. గ్రామంలో ఉన్న ప్రధానంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు నడుంబిగించారు. కార్యక్రమంలో ధర్మిరెడ్డి సన్యాసినాయుడు, లాలం లక్ష్మి,సత్తిబాబు, శ్రీను, తాతబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : అచ్యుతాపురంలోని పలు కూడళ్లలో ఆక్రమణలు గురువారం తొలగించారు. అచ్యుతాపురం సుందరీకరణలో భాగంగా అధికారులు సమన్వయంతో రహదారి ఆక్రమణలు తొలగించే పనిని చేపట్టారు. సీఐ బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా డ్రైనేజీని సైతం గాడిలో పెట్టి సెజ్ ప్రాంత హెడ్‌క్వార్టర్‌ను అందంగా తీర్చి దిద్దే పనిలో పడ్డారు. దీనికి అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

చోడపల్లి వద్ద వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం : మండలంలోని చోడపల్లి వద్ద హెవీ లోడ్‌తో వెళుతున్న వాహనాలను సీఐ బుచ్చిరాజు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆయా వాహనా దారులకు నిబంధనల గురించి వివరించారు. పరిమితికి మించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యోగాభ్యాసం ఆరోగ్య దాయకం

- మానసిక వికాసానికి దోహదం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- వేడుకలకు సిద్ధంగా నాగులాపల్లి చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం



నాగులాపల్లిలోని చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యానకేంద్రం



పాటిపల్లి కస్తూర్బా బాలికల విద్యాలయంలో ధ్యానం చేస్తున్న విద్యార్థినులు(ఫైల్)

మునగపాక : ప్రతి ఒక్కరిలో మానసిక వికాసం, దైవ చింతన, స్వీయ క్రమశిక్షణకు యోగా దోహదపడుతుంది. కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ జీవన గమనంలో వచ్చే మార్పులపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తిస్తున్నారు. ఇందుకోసం సాత్వికమైన ఆహారం తీసుకోవడంతో పాటు యోగ సాధన ద్వారా ఒత్తిళ్ల నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాటిస్తున్నారు.

అయిదేళ్లుగా యోగాపై శిక్షణ

నాగులాపల్లిలో అయిదేళ్ల క్రితం చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కేంద్రం ద్వారా ప్రతి రోజు పిల్లల నుంచి పెద్దల వరకు యోగాపై అవగాహన కల్పిస్తూ మానసిక ఒత్తిళ్ల నుంచి ప్రజలను దూరం చేసేందుకు యోగా ఎంతమేర దోహదపడుతుందనే విషయమై యోగా నిర్వాహకులు సుజాత వివరిస్తూ వస్తున్నారు. దీంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. యోగా సాధనతో మానసిక ప్రశాంతతతో పాటు ఉల్లాసంగా ఉండగలమని నిరూపిస్తున్నారు. యోగా ద్వారా నైపుణ్యం పెంపుదల, ఆధ్యాత్మికత అలవర్చుకోవచ్చు. ప్రతి ఏటా పలు పాఠశాలల్లో విద్యార్థులకు యోగాపై అవగాహన సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ నాగులాపల్లిలోని చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం గుర్తింపు పొందింది. దీనిలో భాగంగా శుక్రవారం అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని ఉదయం 10 గంటల నుంచి తరువాత రోజు తెల్లవారే వరకు పౌర్ణమి ధ్యానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సుజాత తెలిపారు.

యోగా ద్వారా కలిగే ప్రయోజనాలు

శరీరంలో మెదడుకు శక్తి అందుతుంది. ఆక్సిజన్ సరఫరా జరుగుతుంది. రక్త ప్రసరణ బాగుంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడికి దూరంగా ఉండవచ్చు. చురుకుదనంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఏకాగ్రత, ఆలోచన విధానం పెరుగుతుంది. చదువులో రాణించడం అలాగే మనస్సు అదుపులో ఉండడం, శరీరం అంతర్గతంగా శుభ్రం అవుతుంది. చర్మం కాంతివంతంగా ఉండడంతో పాటు స్వర పేటిక సమస్య తగ్గుతుంది. దీనికి తోడు శరీరంలో ఉన్న విష పదార్థాలు తొలగిపోతాయి.

యోగా సాధన ఎంతో అవసరం



యోగాపై సాధన చేయడం అలవాటు చేసుకోవాలి. మానసిక ప్రశాంతత అలాగే మానసిక వికాసం దొరుకుతుంది. మారుతున్న కాలంతో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం మంచిది. ఎటువంటి రుగ్మతలకు గురికాకుండా ఉండేందుకు యోగా దోహదపడుతుంది. పదేళ్ల దాటిన నాటి నుంచి ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం నేర్చుకోవాలి. తద్వారా ఆరోగ్య సమస్యలు నివారించుకోవచ్చు.

–సుజాత, సీనియర్ పిరమిడ్ మాస్టారు, నాగులాపల్లి

డ్రగ్స్ జోలికి పోకండి

- మాదకద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు
- సెబ్ సీఐ పి.ఉమామహేశ్వరరావు
- కళాశాల విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సెబ్ అధికారులు

యలమంచిలి : డ్రగ్స్ మహమ్మరి జోలికి విద్యార్థులు పోరాదని యలమంచిలి సెబ్ సీఐ పి.ఉమామహేశ్వరావు కోరారు. డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల సూచనలు మేరకు ఆయన గురువారం తన సిబ్బందితో కలసి యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రస్తుత సమాజంలో యువతీ యువకుల్లో డ్రగ్స్ తీసుకోవడం ఎక్కువైందని డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా విద్యార్థుల్లో మానసికంగా శక్తి నశించి వారిలో నేరపూరితమైన ప్రవర్తనలకు విద్వేష పూరితమైన ఘటనలకు లోనై హత్యలు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. డ్రగ్స్ తీసుకునే వారిపై , మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గంజాయి వంటి కేసుల్లో యువత ఒక్కసారి పట్టుబడితే జైలు కెళ్లడంతో పాటు జీవితం అంతా అంధకారమవుతుందన్నారు. సమాజంలో విద్యార్థులు తల్లిదండ్రులకు చెడ్డ పేరు తీసుకురాకుండా ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు తరలించినట్లు తెలిస్తే తమకు సమాచారం అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ శ్రావణ్, సెబ్ పోలీసులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో దుష్పరిణామాలు



విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ అధికారులు

పాయకరావుపేట : మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు, ఎస్ఐ పి.జాన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల : నేడు బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ, ఎంపీయూపీ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నేడు బడికి పోతా.. కార్యక్రమంపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులను చైతన్యం చేయాలన్నారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, అందుకోసం ప్రతి గృహాన్ని సందర్శించి బడి ఈడు పిల్లను గుర్తించాలన్నారు. విద్య ప్రాధాన్యతను వివరించి బడికి వచ్చేలా చైతన్యం చేయాలన్నారు. ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ మాట్లాడుతూ విద్యా శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం వచ్చే 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. శత శాతం అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ ఎంటీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పశు వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



పశు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న పశు సంవర్ధక శాఖాధికారులు

కోటవురట్ల: పశువుల్లో సీజనల్‌గా వచ్చే గొంతు వాపు వ్యాధి, జబ్బు వాపు వ్యాధి పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చందక నరసింహులు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో కోటవురట్ల, మాకవరపాలెం మండలాలకు చెందిన పశు వైద్యాధికారులతో గురువారం సమావేశం నిర్వహించి వ్యాధులపై అవగాహన కల్పించారు. డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ ప్రస్తుతం పశువుల్లో ఎక్కువగా గొంతు వాపు వ్యాధి, జబ్బువాపు వ్యాధి సంక్రమిస్తోందని, దీనిపై ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి సోకకుండా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రప్పడు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో ఘనంగా యోగా దినోత్సవం



శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలో విద్యార్థుల యోగాసనాలు

పాయకరావుపేట : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ ప్రకాష్ విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో మంచి జ్ఞాపక శక్తి, మానసిక ప్రశాంతత కలుగుతుందని, మనసులోని అంతర్గత శక్తి స్రవంతులను తెరవగలిగే శారీరక భంగిమలే ఆసనాలని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఆసనాల ద్వారా బాధ, ఒత్తిడి, ఆందోళనలను అధిగమించే శక్తి లభిస్తుందని, మనసును శాంతపరచి సమతుల్యత సాధించడానికి యోగాభ్యాసం ఉపకరిస్తుందని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పలు జాతీయ స్థాయి యోగా పోటీల్లో బహుమతులు సాధించిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు క్లిష్టమైన ఆసనాలను వేసి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు పాటుపడాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు కోరారు. మునగపాక మండల పరిషత్ హాల్లో గురువారం సాయంత్రం హెచ్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థి కిట్‌లను అందజేయడంతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, ఎస్ఐ ప్రసాదరావు, సీఆర్పీలు కర్రి లక్ష్మీనారాయణ, అచ్యుతకృష్ణ, సత్తిబాబు, గోవిందతో పాటు పలువురు హెచ్ఎంలు సమావేశంలో పాల్గొన్నారు.

వడగాడ్పులతో విలవిల

రాంబిల్లి : రెండు రోజులుగా వీస్తున్న వడగాడ్పులకు జనం విలవిలలాడుతున్నారు. ఎండతీవ్రతకు వేడిగాలులు తోడవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. గతంలో ఎన్నడూ జూన్ నెల చివర్లో ఇలాంటి వడగాడ్పులు లేవని పలువురు చెబుతున్నారు. వడగాడ్పులకు పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు.

సీడ్ డ్రిల్ పద్ధతిలో వరి విత్తుకోండి

- అందుబాటులో కలుపు నివారణ మందులు
- జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీధర్



సీడ్ డ్రిల్ ద్వారా వరి విత్తే పద్ధతిని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు



వరి విత్తు పద్ధతులపై రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి : వరి విత్తులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీధర్ అన్నారు. ఆయన యలమంచిలి మండలం రామారాయుడుపాలెం గ్రామంలో రైతులకు వరి విత్తే పద్ధతులపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో కలసి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి సీడ్ డ్రిల్ ద్వారా వరి విత్తనాలు ఏవిధంగా నాటాలో రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరా పొలానికి 20 కేజీల విత్తనం అవసరం అవుతుందని, విత్తనంతో పాటు ఎరువు కూడా ఒకేసారి వేయవచ్చునని ఈ విధంగా చేయడం వల్ల పెట్టుబడి ఖర్చు తక్కువగా అవుతుందని ఖరీఫ్ సీజన్‌లో యాజమాన్య పద్ధతులు పాటించి వరి పంటను ఏవిధంగా వేసుకోవాలి వంటి అంశాలపై ప్రణాళికా కార్యాచరణపై రైతులకు వివరించారు. ముందస్తుగా కలుపు నివారణ మందులు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకొని పంటలు వేసుకుంటే మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి మోహనరావు , వ్యవసాయ శిక్షణ కేంద్రం శాస్త్రవేత్త విజేత, హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రసాదరావు, బండి నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య సమస్యలకు చెక్



కొరుప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



యోగా ప్రయోజనాలు వివరిస్తున్న కొరుప్రోలు ఆయుర్వేదిక్ వైద్యులు సుజాత



ఎస్.రాయవరం : యోగాతో పలు ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చని కొరుప్రోలు ఆయుర్వేదిక్ వైద్యులు సుజాత అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా డే పురస్కరించుకుని గురువారం గ్రామంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోజూ యోగా సాధనం చేయడం వల్ల మానసిక స్థితిని మెరుగుపరుస్తుందని, రక్తపోటును తగ్గిస్తుంది, ఒత్తిడిని తగ్గించడం ద్వారా శరీరాన్ని సులభతరం చేస్తుందని వివరించారు. కాగా గుడివాడ ఉన్నత పాఠశాలలో పీడీ రాజు విద్యార్థులతో యోగా విన్యాసం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కొరుప్రోలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

మునగపాక : రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలను అధికారులు అందుబాటులో ఉంచారన్నారు. వాడ్రాపల్లి ఆర్‌బీకేలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఆయన గురువారం అందజేశారు. వీఏఏ తులసి పాల్గొన్నారు.

25న రేషన్ బియ్యం వేలం

యలమంచిలి రూరల్ : ప్రజా పంపిణీ వ్యవస్థకు వినియోగించే బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి నమోదైన వివిధ కేసుల్లో పట్టుబడిన సుమారు 15.224 టన్నుల బియ్యానికి ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు యలమంచిలి తహసీల్దార్ అప్పలరాజు విలేకరులకు తెలిపారు. యలమంచిలి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిర్వహించబోవు బియ్యం వేలం పాటకు ఆసక్తి ఉన్న వారెవరైనా హాజరు కావచ్చని ఆయన చెప్పారు. వేలం పాట నిర్వహించనున్న బియ్యం నిల్వలను ముందుగానే పరిశీలించుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా పౌరసరఫరా అధికారి, యలమంచిలి తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించామన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ అమ్మవారి పండగ

రాంబిల్లి : గోవిందపాలెం గ్రామంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయం సహా పలు వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

మూలపేటలో దోమల మందు పిచికారీ

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో గురువారం ఆయన దోమల మందు పిచికారీ పనులను పరిశీలించారు. మూలపేటలో పారిశుధ్యం సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.